సాక్షి నిర్మల్

శుక్రవారం । 27 । అక్టోబర్ । 2023



ఎ'లక్షణం'గా సాగేందుకు...
జిల్లా ఎన్నికల అధికారి నుంచి బూత్ లెవల్ అధికారి (బీఎల్వో) వరకు సమన్వయంతో విధులు నిర్వహిస్తేనే ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తవుతుంది. అధికారుల విధులపై కథనం.
10లో ▸



రైల్వే ప్రయాణికులకు అవస్థలు
భైంసా డిపోకు చెందిన బస్సు బాసర రైల్వేస్టేషన్‌కు ఆలస్యంగా రావడంతో ప్రయాణికులు హైదరాబాద్ వెళ్లే అజంతా ఎక్స్‌ప్రెస్ మిస్సయ్యారు.
11లో ▸

గరిష్టం/కనిష్టం
32.6 / 18.4

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. మంచు కురుస్తుంది. చలి ప్రభావం పెరుగుతుంది.

న్యూస్‌రీల్

కొలువుదీరిన శారదామాత



పూజల్లో ఆర్యవైశ్య సంఘ మహిళలు

భైంసాటౌన్: పట్టణంలో శారదామాత ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈమేరకు బ్రాహ్మణ్‌సమాజ్ ఆధ్వర్యంలో బ్రాహ్మణ్‌గల్లీలోని రాధాకృష్ణమందిర్‌లో, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక గుజిరిగల్లీలోని సంఘ భవనంలో శారదామాత విగ్రహాలు ప్రతిష్ఠించారు. ఏటా దుర్గా నవరాత్రి ఉత్సవాలు ముగిసిన తరువాతి రోజు నుంచి శారదామాత ఉత్సవాలు నిర్వహిస్తారు. అమ్మవారికి ఐదు రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజ లు నిర్వహించనున్నారు. చివరిరోజున శోభా యాత్రగా అమ్మవారి విగ్రహాలను గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు తరలించి నిమజ్జనం చేస్తారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి



సోయా కొనుగోళ్లు ప్రారంభిస్తున్న ప్రవీణ్‌రెడ్డి

భైంసాటౌన్/కుభీర్: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు మక్కలు, సోయా విక్రయించాలని మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో గురువారం సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని సారంగపూర్, భైంసా, కుభీర్, నిర్మల్, తానూర్, ముథోల్‌లో పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో సోయా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. క్వింటాల్‌కు మద్దతు ధర రూ.4,600 చెల్లిస్తారన్నారు. అలాగే లక్ష్మణచాంద, మామడ, ఖానాపూర్, నిర్మల్, దిలావర్‌పూర్, లోకేశ్వరం, ముథోల్‌లో మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. క్వింటాలుకు రూ.2,090 మద్దతు ధర చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు తమ సోయా పంటను 12 శాతం వరకు తేమతో మార్కెట్‌కు తీసుకురావాలని సూచించారు. వారంరోజుల్లో డబ్బులు రైతుల ఖాతాల్లో జమవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఉన్నత శ్రేణి కార్యదర్శి అడెల్లు, కార్యదర్శి శ్రీనివాస్, పీఏసీఎస్ సీఈవో తానాజీ ఉన్నారు.

విజయగంట మోగించిన విఠల్‌రెడ్డి



గంట మోగిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

కుంటాల: ముథోల్ నియోజకవర్గం కుంటాల మండలం సూర్యాపూర్ శ్రీరాజరాజేశ్వరాలయం ఈశాన్య దిశలో ఉంది. గతంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా పోటీచేసిన విఠల్‌రెడ్డి ఈ ఆలయంలో పూజలు నిర్వహించి ప్రచారం చేయడంతో విజయం సాధించారు. మూడోసారి బరిలో నిలిచిన విఠల్‌రెడ్డి హ్యాట్రిక్ విజయం సాధించాలని గురువారం ఆలయంలో పూజలు చేశారు. అనంతరం సూర్యాపూర్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

బీజేపీలో చేరిన బీఆర్ఎస్ అసమ్మతి నేత



రాజేశ్‌బాబును బీజేపీలోకి ఆహ్వానిస్తున్న కిషన్‌రెడ్డి

లోకేశ్వరం: ముథోల్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ అసమ్మతి నేత, భైంసా ఎస్ఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు గురువారం పార్టీని వీడారు. హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. రాజేశ్‌బాబుతోపాటు భైంసా, బాసర జెడ్పీటీసీలు దీప, వసంత, బాసర ఎంపీపీ సునీత, ముథోల్ జాగృతి కన్వీనర్ పండిత్‌రావు, కుంటాల మాజీ ఎంపీపీ జీవీ.రమణరావు, నాయకులు సాప్లి రమేశ్, సోలంకి భీంరావుతోపాటు వివిధ పార్టీలకు చెందిన తాజా, మాజీ ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు, 250 మంది బీజేపీలో చేరారు. బీఆర్ఎస్ సిద్ధాంతాలు నచ్చకనే బీజేపీలో చేరామని రాజేశ్‌బాబు తెలిపారు. పంచగుడి వంతెన మీ దుగా హైదరాబాద్ బయల్దేరే ముందు బీజేపీ కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు. రాజేశ్‌బాబు వెంట లోకేశ్వరం నాయకులు శ్రీధర్, చిన్నరావు, రవీందర్‌రావు ఉన్నారు.

అందరూ సైకిల్ స్టూడెంట్లే..!

- తెలుగు దేశం నుంచి రాజకీయ పాఠాలు
- ఇప్పుడున్న నాయకులందరికీ టీడీపీ పుట్టినిల్లు
- సైకిల్ సవారీతో గల్లీ నుంచి ఢిల్లీ దాకా ఎదిగిన నేతలు
- ప్రస్తుత ఎన్నికల్లో పత్తాలేని పార్టీ..



జంగ్ తెలంగాణ

నిర్మల్: పదేళ్ల కిందటి వరకు పల్లె నుంచి పట్నం దాకా, గల్లీ నుంచి ఢిల్లీ దాకా.. రెండే పార్టీలది రాజ్యం. ప్రజలకు తెలిసినవి చేతి గుర్తు లేదంటే.. సైకిల్ గుర్తు.. జిల్లాలోనూ ఈ రెండు పార్టీలదే హ వా నడిచింది. దశాబ్దాలపాటు సైకిల్ గుర్తు విజయవిహారం చేసింది. తెలుగుదేశమంటే బడుగు, బలహీనవర్గాల పార్టీ అంటూ సామాన్య జనంలోకి చొచ్చుకువెళ్లింది. ఒక దశలో కాంగ్రెస్‌నే కనుమరుగు చేసేదాకా దూసుకెళ్లింది. ఇప్పుడున్న ఎంతోమంది రాజకీయ దురంధరులను, మహామహులైన నేతలను ప్రజలకు పరిచయం చేసింది. ఏళ్లకు ఏళ్లు ఓటమి ఎరుగని పార్టీగా జిల్లాను కంచుకోటగా మలుచుకుంది. ఇదంతా గత వైభవం. పార్టీలో నుంచి ఒక్కో నాయకుడు జారుకోవడంతో పసుపు పార్టీ తన ప్రాభవాన్ని కోల్పోయింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొత్తానికే తుడిచిపెట్టుకుపోయింది. 2014 ఎన్నికల్లో బరిలో నిలిచిన పార్టీ ఆ తర్వాత నుంచి కనిపించడం లేదు.

నాడు హవా..

తెలుగుదేశం పార్టీని 1982లో ఎన్టీ రామారావు ప్రారంభించారు. పార్టీ ఏర్పడిన తొమ్మిదినెలల్లోనే 1983 ఎన్నికల్లో బరిలో దిగి వీరవిహారం చేసింది. జిల్లాలోనూ టీడీపీ తన సత్తా చాటింది. ఆ ఎన్నికల్లో నిర్మల్ నుంచి అయిండ్ల భీంరెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అప్పట్లో ఏకంగా శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా పనిచేశారు. అప్పటి నుంచి నిర్మల్ టీడీపీ కంచుకోటగా మారిపోయింది. వరుసగా 1985, 1989, 1994లో సముద్రాల వేణుగోపాలచారి హ్యాట్రిక్ విజయాలను సొంతం చేసుకున్నారు. 1996లో ఆయన ఎంపీగా పోటీ చేయడంతో జరిగిన ఉప ఎన్నికల్లో నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి టీడీపీ అభ్యర్థిగా బరిలో దిగి విజయం సాధించారు. ముథోల్ నియోజకవర్గంలో 1985లో బోణీ కొట్టింది. ఇక్కడ ఏ.హన్మంత్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1994లో భోస్లే నారాయణరావు పటేల్, 2009లో సముద్రాల వేణుగోపాలచారి గెలుపొంది ముథోల్‌లోనూ సైకిల్ హవా చాటారు. ఇక ఖానా పూర్‌లో 1983 నుంచి వరుస ఓటములను చవిచూసిన టీడీపీ 1994 నుంచి సత్తా చాటడం మొదలుపెట్టింది. 1994లో అజ్మీరా గోవింద్ నాయక్, 1999 రమేశ్‌రాథోడ్, 2008 ఉప ఎన్నికలో రాథోడ్ సుమన్‌బాయి, 2009లో మళ్లీ రాథోడ్ సుమన్‌బాయి ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. సముద్రాల వేణుగోపాలచారి టీడీపీ ఆదిలాబాద్ ఎంపీగా 1996, 98, 99లలో వరుసగా హ్యాట్రిక్ విజయాలను సాధించారు. తెలుగుదేశం ఎమ్మెల్యే, ఎంపీగా ఆయన డబుల్ హ్యాట్రిక్ సాధించి రికార్డు సృష్టించారు.

కనుమరుగు..

ఎమ్మెల్యేలు, ఎంపీలే కాదు.. జిల్లా పరిషత్, మున్సిపల్, డీసీసీబీ, డీసీఎంఎస్ ఇలా ఎంతోమంది చైర్మన్లుగానూ టీడీపీ నుంచి వెలుగు వెలిగిన నేతలు ఉన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004 ఎన్నికల్లో పార్టీ ఓడిపోయినప్పటి నుంచి క్రమంగా సైకిల్ కనుమరుగవుతూ వచ్చింది. తెలంగాణ ఉద్యమం, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుతో ఆంధ్రప్రదేశ్‌కే పరిమితమైంది. టీటీడీపీ పేరిట తెలంగాణలోనూ ఉన్నా అది నామమాత్రమే. జిల్లాలో మాత్రం గతమెంతో ఘనమైన చరిత్ర ఉన్న తెలుగుదేశం ఖతమైపోయింది.

సైకిల్ నేర్పిన రాజకీయమే..

ఉమ్మడి ఆదిలాబాద్‌లోనే చక్రం తిప్పిన జిల్లా నేతలందరికీ తెలుగుదేశమే పుట్టినిల్లు. చాలామంది లీడర్లకు ఆ పార్టీ రాజకీయ జన్మనిచ్చింది. ప్రస్తుత రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న వివిధ పార్టీల నేతలందరూ టీడీపీ నుంచి వచ్చినవాళ్లే.

- ప్రస్తుతం నిర్మల్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి 1991లో టీడీపీ నుంచే ఆదిలాబాద్ ఎంపీగా గెలిచారు.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో మంత్రిగా, బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఢిల్లీలో అధికార ప్రతినిధిగా, ప్రస్తుతం ఐడీసీ చైర్మన్‌గా ఉన్న వేణుగోపాలచారి 'సైకిల్' సవారీ చేస్తూ ఏళ్లపాటు ఉమ్మడి జిల్లాలో చక్రం తిప్పారు.
- ప్రస్తుతం బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.సత్యనారాయణగౌడ్ టీడీపీ నుంచి వచ్చినవారే. 2004లో సత్యనారాయణగౌడ్ నిర్మల్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి రెండో స్థానంలో నిలిచారు.
- ప్రస్తుతం ముథోల్ కాంగ్రెస్ టికెట్ కోసం పోటీ పడుతున్న నారాయణరావు పటేల్ 1994లో టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రస్తుత ముథోల్ బీజేపీ అభ్యర్థి రామారావుపటేల్ సైతం తన వరుస సోదరుడైన నారాయణరావు పటేల్ వెంట టీడీపీలో పనిచేశారు.
- ఖానాపూర్ బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉన్న మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ రమేశ్‌రాథోడ్, ఆయన సతీమణి మాజీ ఎమ్మెల్యే సుమన్ రాథోడ్ టీడీపీ నుంచే రాజకీయాల్లో రాణించారు.
- నిర్మల్ బీజేపీ అభ్యర్థిగా ఉన్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సైతం కొంతకాలం టీడీపీలో పనిచేశారు.
- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ పడకంటి రమాదేవి సైతం గతంలో టీడీపీలో పనిచేశారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్

నిర్మల్‌చైన్‌గేట్: వానాకాలం ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ అధికారులను ఆదేశించారు. వానాకాలం ధాన్యం కొనుగోలుకు సంబంధించి సమీకృత కలెక్టరేట్‌లో అధికారులు, మిల్లర్లు, లారీ కాంట్రాక్టర్లతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోర్‌కుమార్ మాట్లాడుతూ ఆయా సెంటర్లకు గన్నీ బ్యాగుల సరఫరా ప్రాధాన్యత క్రమంలో పంపిస్తున్నామన్నారు. కొనుగోలు సెంటర్ల వద్ద ప్యాడీ క్లీనర్స్ ద్వారా తూర్పారబట్టాలన్నారు. మిల్లర్ల వద్దకు ధాన్యాన్ని పంపకముందే శుద్ధి చేసి పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోళ్లను ఏఈవోలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. గన్నీ బ్యాగుల కొరకు పౌరసరఫరాల సంస్థ మేనేజర్‌ను, మాయిశ్చర్, వేయింగ్ మిషన్లు, టార్పాలిన్ల కోసం మార్కెటింగ్ ఏడీని సంప్రదించాలని సూచించారు. మిల్లర్లు ధాన్యం నిల్వకు గోదాములు సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో డీఎస్‌వో అలీ, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకళ, వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్, డీసీవో శ్రీనివాస్, డీఆర్డీవో విజయలక్ష్మి, రైస్ మిల్లుల సంఘం ప్రతినిధులు నిర్మల్, మహేష్, లారీ కాంట్రాక్టర్స్ రహీమ్, మధు, మానిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్‌–14, అండర్ –17 బాల, బాలికల జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు శనివారం నిర్వహించనున్నట్లు కమిటీ కన్వీనర్, ప్రధానోపాధ్యాయుడు జి.కిషన్‌రావు, పీడీ దర్శనం దేవేందర్ తెలిపారు. పోటీలకు హాజరయ్యే విద్యార్థులు శనివారం ఉదయం 10 గంటల వరకు పాఠశాలలో రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు.

డిజిటల్ లావాదేవీలపై ఈసీ నజర్!

నిర్మల్ జిల్లా కేంద్రం ఈద్‌గాం సమీపంలోని ఓ ప్రైవేటు బ్యాంకులో ఖాతాదారుడు వారం రోజుల క్రితం రూ.5 లక్షల మేర బ్యాంకు లావాదేవీలు సాగించాడు. తాజాగా శాసనసభ ఎన్నికల నేపథ్యంలో అధికారులు తరచూ బ్యాంకర్లతో సమావేశాలు జరిపి లావాదేవీలపై నిఘా పెట్టాలని సూచించడంతో ఆ బ్యాంక్ అధికారులు సదరు ఖాతాదారునికి ఫోన్ చేశారు. పరిమితికి మించి యూపీఐ లావాదేవీలు జరిపారని ఖాతాపై ఆంక్షలు విధించనున్నట్లు హెచ్చరించారు. అయితే ఖాతాదారుడు ఇలాంటి లావాదేవీలను గతంలోనూ రూ.10 లక్షల పైగా పలుమార్లు జరిపానని ఇలా ఎన్నడు ఆంక్షలు పెట్టలేదని అంటున్నాడు.

ఖానాపూర్ పట్టణంలోని మరో ఖాతాదారుడికి కూడా ఇలాగే బ్యాంకు నుంచి సిబ్బంది ఫోన్ చేశారు. మీ ఖాతా ద్వారా యూపీఐ లావాదేవీలు పరిమితికి మించి జరుపుతున్నారని ఒకసారి బ్యాంకులో సంప్రదించాలని తెలపడంతో ఆ ఖాతాదారుడు కంగుతిన్నాడు. గత 15 ఏళ్లలో ఇలా ఎన్నడూ బ్యాంకు వారు ఫోన్ చేయడం చూడలేదని అంటున్నాడు. దీంతో ఖాతాదారుడు ఆందోళన చెందుతున్నాడు.



- యూపీఐ చెల్లింపులపై బ్యాంకర్ల దృష్టి
- పరిమితికి మించితే ఖాతాపై ఆంక్షలు
- ఎన్నికల నేపథ్యంలో ఈసీ ఆదేశాలు

నిర్మల్ ఖిల్లా: డిజిటల్ లావాదేవీలపై ఎన్నికల యంత్రాంగం దృష్టి సారించింది. పరిమితికి మించి జరుగుతున్న లావాదేవీలను బ్యాంకర్లు పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా యూపీఐ లావాదేవీలను ప్రత్యేక దృష్టితో చూస్తున్నారు. అత్యధికంగా లావాదేవీలు జరిపిన వారికి బ్యాంకు నుంచి ఫోన్ చేసి మరి హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఖాతా నుంచి అధిక లావాదేవీలు జరుపుతుండడంపై వివరణ కోరుతున్నారు.

తనిఖీలతో తలనొప్పి..

శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే ఎక్కడికక్కడ పోలీస్ యంత్రాంగం తనిఖీలు నిర్వహిస్తోంది. పట్టణాలు మండల కేంద్రాలు జిల్లా సరిహద్దుల వద్ద గల చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో చాలా మంది డిజిటల్ లావాదేవీలను ఆశ్రయిస్తున్నారు. అయితే డిజిటల్ లావాదేవీలు సైతం పరిమితికి మించి జరుగుతున్నాయని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు అందడంతో వారు బ్యాంకర్లకు తగిన ఆదేశాలు జారీ చేశారు. బ్యాంకర్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి యూపీఐ లావాదేవీలపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచిస్తున్నారు. దీంతో బ్యాంకు అధికారులు యూపీఐ ద్వారా ఎక్కువ మొత్తంలో లావాదేవీలు జరుపుతుండడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

ఎన్నికల కమిషన్ ఆదేశాలు..

డిజిటల్ లావాదేవీలపై ఎన్నికల కమిషన్ కఠినంగా వ్యవహరిస్తుండడంతో అత్యధికంగా లావాదేవీలు జరిపిన ఖాతాదారుల లెక్కలు తీసే పనిలో బ్యాంక్ అధికారులు నిమగ్నమవుతున్నారు. ఇలాంటి వారి ఖాతాలను సమగ్ర నివేదిక రూపంలో తయారుచేసి ఎన్నికల కమిషన్‌కు సమర్పించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కువ మొత్తంలో నగదు కలిగి ఉండే ఖాతాలు, వ్యాపార ఖాతాలు, సాధారణ ప్రజలకు సంబంధించిన వ్యక్తిగత లావాదేవీల వివరాలను బ్యాంకర్లు నిత్యం పరిశీలిస్తున్నారు. అత్యధికంగా లావాదేవీలు జరుపుతున్న ఖాతాలపై ఆంక్షలు కూడా పెడతామని ఫోన్ల ద్వారా హెచ్చరిస్తున్నారు. గతంలో జరిపిన నగదు లావాదేవీలు, ఈ నెల రోజులలో జరుగుతున్న లావాదేవీలను పోల్చి చూసి సమగ్ర నివేదికలు సిద్ధం చేయడానికి సన్నద్ధమవుతున్నారు. ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, ఆన్‌లైన్ బ్యాంకింగ్ తదితర లావాదేవీలపై ప్రత్యేక దృష్టి సారించారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష

- కాంగ్రెస్ రైతు వ్యతిరేక పార్టీ
- రౌడీల్లా వ్యవహరిస్తున్న బీజేపీ నాయకులు
- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే తమ పార్టీకి శ్రీరామ రక్ష అని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం మాట్లాడారు. దసరా సందర్భంగా మహాలక్ష్మి ఆలయ ప్రాంగణంలో జరిగిన వేడుకల్లో బీజేపీ నేతలు వ్యవహరించిన తీరును ఖండించారు. నిర్మల్‌లో బీజేపీ నాయకులు రౌడీల్లా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. దౌర్జన్యాలు చేస్తున్నారని, బెదిరింపులకు దిగుతున్నారని పేర్కొన్నారు. మంత్రిగా ఉన్న తనను వేదికపైకి పిలిచారని తెలిపారు. ఇది రుచించని బీజేపీ నేతలు హంగామా చేశారని మండిపడ్డారు. నామినేషన్లు కూడా వేయకముందే ఇలా వ్యవహరిస్తే రానున్న రోజుల్లో ఇంకేం చేస్తారో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారని వివరించారు. ఇక రైతుబంధును ఆపాలని ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ రైతు వ్యతిరేక పార్టీ అని ఆరోపించారు. రైతులు, ప్రజలు కాంగ్రెస్‌కు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. ఎన్నికల ప్రచారానికి వచ్చే ఆ పార్టీ అభ్యర్థులను నిలదీయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి సత్యనారాయణగౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ అప్పాల గణేశ్, సీనియర్ నాయకులు డాక్టర్ సుభాష్‌రావు, పాకాల రాంచందర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్

నిర్మల్‌చైన్‌గేట్: మూడోదశ అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్ పకడ్బందీగా చేపట్టాలని డీఎంహెచ్‌వో ధనరాజ్ సూచించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, అసంక్రమిత వ్యాధుల నియంత్రణ, నివారణపై మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, ఏఎన్ఎంలతో గురువారం సమీక్ష నిర్వహించారు. నవంబర్ 1 నుంచి జిల్లాలో మూడో దశ అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్ నిర్వహించాలన్నారు. 30 ఏళ్లు దాటిన అందరికీ పరీక్షలు చేయాలని సూచించారు. స్క్రీనింగ్ చేయడానికి అవసరమైన లాజిస్టిక్స్ అన్నీ ముందుగానే సంసిద్ధం చేసుకోవాలని తెలిపారు. ప్రజలకు సకాలంలో మెరుగైన నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించాలన్నారు. గర్భిణులను 12 వారాల లోపు నమోదు చేయాలని, సమయానుసారం పరీక్షలు నిర్వహించాలన్నారు. క్షయ నివారణ లక్ష్యాలను సాధించాలని సూచించారు. సమావేశంలో శ్రీనివాస్, విమల, నిర్మల్ డివిజన్‌లోని మిడ్‌లెవెల్ హెల్త్‌ప్రొవైడర్స్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను భూస్థాపితం చేయాలి

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు



కాంగ్రెస్‌లో చేరిన యువకులతో శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని భూస్థాపితం చేస్తేనే తెలంగాణకు బంగారు భవిష్యత్ ఉంటుందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, నిర్మల్ ఎమ్మెల్యే అభ్యర్థి కూచాడి శ్రీహరిరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీనగర్, బుధవార్‌పేట్ కాలనీకి చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు శివకుమార్, నాందేడపు చిన్ను ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి శ్రీహరిరావు కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ వారి అవసరాల కోసం వాడుకుని తర్వాత చీకొడుతారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ హవా నడుస్తోందని తెలిపారు. సోనియా గాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలతో తెలంగాణ ప్రజలు సంతోషంగా ఉంటారన్నారు. నిర్మల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.



జిల్లాలో దసరా పండుగ తర్వాత సద్దుల బతుకమ్మ పండుగ నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలో గురువారం నిర్మల్, ఖానాపూర్, దిలావర్‌పూర్, కుంటాల మండలాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చారు. సాయంత్రం కూడళ్లలో బతుకమ్మ పాటలు పాడుతూ ఆడారు. యువతులు కోలాటం, దాండియాతో ఆకట్టుకున్నారు.

- నిర్మల్‌ఖిల్లా/ఖానాపూర్/దిలావర్‌పూర్/కుంటాల



ఓలాలో బతుకమ్మ ఎత్తుకున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



ఖానాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



మస్కాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

జాతీయ పుస్తక నిలయంలో ఉపాధ్యాయుడికి సభ్యత్వం



సభ్యత్వ పత్రం అందజేస్తున్న యువరాజ్ మాలిక్

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాదరి ఎల్లన్న 2023 విద్యా సంవత్సరానికిగాను జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డుకు నామినేట్ అయ్యారు. భారత ప్రభుత్వం ఆదేశాల మేరకు జాతీయ పుస్తక నిలయంలో ఎల్లన్నకు సభ్యత్వం కల్పించారు. ఏటా రూ.10,900 విలువ గల పుస్తకాలను ఈ మెయిల్ ద్వారా పాఠశాలకు పంపుతారు. న్యూఢిల్లీ జాతీయ పుస్తక నిలయం డైరెక్టర్ యువరాజ్ మాలిక్ పాఠశాలలో పిల్లలకు సభ్యత్వ నమోదు పత్రాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లన్నను పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమారాణి, భీమేష్, ప్రియాంక, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భార్యను చంపిన భర్తకు జీవిత ఖైదు

ఆదిలాబాద్‌టౌన్: భార్యను చంపిన కేసులో భర్తకు జీవిత ఖైదు విధిస్తూ జిల్లా జడ్జి డాక్టర్ సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ గురువారం తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి గంగాసింగ్ తెలిపారు. గాదిగూడ మండలంలోని లోకారి (బి)కి చెందిన నాయక్ న్యానేశ్వర్‌కు తొమ్మిదేళ్ల క్రితం ఇంద్రవెల్లి మండలంలోని వద్గాంకు చెందిన శశికళతో వివాహం జరిగింది. దంపతులకు ముగ్గురు సంతానం. ఐకేపీలో సీసీగా విధులు నిర్వహిస్తున్న శశికళపై న్యానేశ్వర్ అనుమానం పెంచుకుని తరచూ గొడవపడేవాడు. ఈ క్రమంలో 2019 జూలై 5న రాత్రి ఆమెపై కిరోసిన్ పోసి నిప్పంటించాడు. గమనించిన స్థానికులు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జూలై 7న మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గాదిగూడ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. 34 మంది సాక్షులను విచారించి మృతురాలి మరణ వాంగ్మూలాన్ని జతపర్చారు. నేరం రుజువు కావడంతో జిల్లా జడ్జి న్యానేశ్వర్‌కు జీవిత ఖైదుతో పాటు రూ.10వేల జరిమానా విధించారు. జరిమానా కట్టని పక్షంలో మరో మూడు నెలల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని వెల్లడించారు.

మట్కా నిర్వాహకుడి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో మట్కా నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు టూటౌన్ ఎస్సై ప్రదీప్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద మట్కా నిర్వహిస్తున్నట్లు వచ్చిన పక్కా సమాచారం మేరకు గురువారం దాడులు జరిపినట్లు తెలిపారు. రణదీవెనగర్ కాలనీకి చెందిన సుక్కాల శివశంకర్ మట్కా నిర్వహిస్తుండగా పట్టుకుని అతని వద్ద నుంచి మట్కా చీటీలతో పాటు రూ.3,050 నగదు నుసైతం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

మట్కా జూదరుడి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలో మట్కా జూదం ఆడుతున్న సిదం మారుతి అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఆదిలాబాద్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ డి.సాయినాథ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని శివాజీ చౌక్ ప్రాంతంలో మట్కా నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు సీసీఎస్ సిబ్బంది అక్కడికి చేరుకుని మారుతిని అదుపులోకి తీసుకున్నారు. అతన్ని విచారించగా మహారాష్ట్రకు చెందిన గోల్ రాయ్, ప్రేమ్ రాయ్‌లతో కలిసి ఆన్‌లైన్‌లో మట్కా నిర్వహిస్తున్నట్లు తెలిపాడు. నిందితుని వద్ద నుంచి రూ.25,500ల నగదుతో పాటు మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్ సేవాదళ్ ప్రధాన కార్యదర్శిగా నీలకంఠేశ్వర్‌రావు



నియామకపత్రం అందుకుంటున్న నీలకంఠేశ్వర్‌రావు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ప్రముఖ వైద్యులు డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు కాంగ్రెస్ సేవాదళ్ ప్రధాన కార్యదర్శిగా నియామకమయ్యారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఆల్‌ఇండియా కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర ఇన్‌చార్జి సంగ్రాం తవాడే చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు.

మూడు జిల్లాల ముచ్చట.. ఖానాపూర్

- ఇక్కడ గెలిస్తే.. మూడు జిల్లాల్లో ప్రోటోకాల్
- గెలుపోటములను నిర్ణయించేది ఆదిలాబాద్ జిల్లా ఓటర్లే
- ఎన్నికల నిర్వహణ బాధ్యతల్లో ఆయా జిల్లాల అధికారులు

కైలాస్‌నగర్/జన్నారం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఖానాపూర్ నియోజకవర్గం ప్రజల దృష్టిని ఆకర్షిస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మూడు జిల్లాలతో పరిధి కలిగి ఉండడం రాజకీయంగానూ ప్రాధాన్యత సంతరించుకుంది. ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికవ్వాలంటే మూడు జిల్లాల్లోని ఓటర్లు ఓటు వేయాల్సి ఉంటుంది. ఎన్నికల నిర్వహణ బాధ్యతలను సైతం ఆయా జిల్లాల అధికారులు పర్యవేక్షించాల్సి రావడం ఆసక్తి రేపుతోంది. ఇక్కడి నుంచి గెలిచిన ఎమ్మెల్యేకు మూడు జిల్లాల్లోనూ అధికారిక ప్రోటోకాల్ అమలు చేయనుండడం ప్రత్యేకతను చాటుకుంటోంది.



నియోజక వర్గం మ్యాప్

పునర్విభజనతో మారిన స్వరూపం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఒకటైన ఖానాపూర్(ఎస్టీ) నియోజకవర్గ స్వరూపం 2016 అక్టోబర్‌లో చేపట్టిన జిల్లాల పునర్విభజనతో మారిపోయింది. సాధారణంగా ఏదైనా ఒక నియోజకవర్గం ఒకటి, లేదా రెండు జిల్లాల పరిధిలో ఉంటుంది. కానీ ఆరు మండలాలతో కూడిన ఖానాపూర్ నియోజకవర్గం మూడు జిల్లాలతో ముడిపడి ఉంది. నియోజకవర్గ పరిధిలోని ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాలు ఆదిలాబాద్ జిల్లాలో, కడెం, దస్తురాబాద్, ఖానాపూర్ మండలాలు నిర్మల్ జిల్లాలో, ఇక మరో మండలం జన్నారం మంచిర్యాల జిల్లాలో ఉన్నాయి. ఇలా మూడు జిల్లాల పరిధిలోకి మారిపోయింది. ఇక్కడి నుంచి పోటీ చేసే అభ్యర్థుల గెలుపోటములను ఆయా జిల్లాల ఓటర్లు నిర్ణయించనున్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల ఓటర్లే గెలుపోటములను ప్రభావితం చేయనున్నారు. పోటీలో ఉండే అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు ఈ రెండు మండలాలపైనే ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. వీరిని ఆకట్టుకుంటే గెలుపు ఖాయమనే దిశగా సాగుతున్నారు.

రెండు జిల్లాల పరిధిలో ఆసిఫాబాద్

మరో నియోజకవర్గమైన ఆసిఫాబాద్ పరిధి కూడా జిల్లాల పునర్విభజనతో రెండు జిల్లాల్లోకి మారింది. ఈ నియోజకవర్గ పరిధిలో పది మండలాలు ఉండగా కెరమెరి, వాంకిడి, జైనూర్, తిర్యాణి, రెబ్బెన, ఆసిఫాబాద్, సిర్పూర్, లింగాపూర్ మండలాలు ఆసిఫాబాద్ జిల్లాలో ఉన్నాయి. గాదిగూడ, నార్నూర్ మండలాలు ఆదిలాబాద్ జిల్లాలో ఉన్నాయి. ఇక్కడి నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేకు ఆయా రెండు జిల్లాల పరిధిలో ప్రోటోకాల్ లభించనుండగా, రెండు జిల్లాల అధికారులు ఎన్నికల నిర్వహణ విధులను పర్యవేక్షించనున్నారు.

ఎన్నికల విధుల్లో అధికారులు

ఖానాపూర్ నియోజకవర్గ ఎన్నికల అధికారి కూడా తన పరిధిలోని మూడు జిల్లాల్లోని మండలాలకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఆయా మండలాల అధికారులతో రిటర్నింగ్ అధికారి సమన్వయం చేసుకోవాల్సి వస్తోంది. పోలింగ్ బూత్‌లు, పోలింగ్ ప్రాంతాలు, ఓటర్లు, సమస్యాత్మక ప్రాంతాలు, ఎన్నికల కోడ్, ఉద్యోగులు, ఈవీఎంల వివరాలను ఆయా జిల్లాల అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సి వస్తోంది. నోడల్ అధికారులు, సెక్టోరియల్ అధికారులు, ప్రత్యేక బృందాలు కూడా ఆయా జిల్లాల అధికారులకు తమ పరిధిలోని సమాచారం ఎప్పటికప్పుడు అందించాల్సి వస్తోంది. ఇక సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులైన తహసీల్దార్లు ఆయా జిల్లా కేంద్రాల్లో జరిగే సమీక్షలకు హాజరు కావాల్సి రావడంతోపాటు ఉన్నతాధికారులకు నివేదికలు అందిస్తున్నారు. ఇలా ఎన్నికల అధికారులు సైతం మూడు జిల్లాల ఎన్నికల అధికారుల పర్యవేక్షణలో పని చేస్తున్నారు.

మూడు జిల్లాల్లో ప్రోటోకాల్

ఖానాపూర్ ఎమ్మెల్యేకు నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాల్లో, ఆసిఫాబాద్ ఎమ్మెల్యేకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాలో ప్రోటోకాల్ అమలు చేస్తారు. ఆయా జిల్లాల్లో జరిగే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాలకు వీరికి ఆహ్వానం అందించాల్సి ఉంటుంది. అభివృద్ధి కార్యక్రమాలు, సమీక్షలు, సమావేశాలు నిర్వహించినా అధికారికంగా సమాచారం అందించాల్సి ఉంటుంది.

ఎ'లక్షణం'గా సాగేందుకు...

- బూత్ లెవెల్ నుంచి జిల్లాస్థాయి వరకు..
- వివిధ స్థాయిల్లో ఎన్నికల అధికారులు
- సజావుగా ప్రక్రియ పూర్తయ్యేందుకు కసరత్తు



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికల ప్రక్రియ అత్యంత ప్రధానమైనది. తన ఓటు హక్కుతో పౌరుడు నచ్చిన నేతను ప్రజాప్రతినిధిగా ఎన్నుకుంటాడు. ఈ క్రమంలో ఓటు హక్కు అనేది వజ్రాయుధంగా భావించవచ్చు. జిల్లా ఎన్నికల అధికారి నుంచి మొదలుకుని గ్రామస్థాయిలో గల పోలింగ్ కేంద్రం బూత్ లెవల్ అధికారి (బీఎల్వో) వరకు సమన్వయంతో విధులు నిర్వహిస్తేనే ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తవుతుంది. ఎక్కడ ఏ చిన్న లోపం ఏర్పడినా ఎన్నికల వ్యవస్థకు ఆటంకం కలుగుతుంది. బరిలో ఉన్న అభ్యర్థులు నామినేషన్ పత్రాల దాఖలు మొదలుకుని ఎన్నికల నియమావళి అమలు, పోలింగ్ ప్రక్రియ, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి వరకు అధికారులు బాధ్యతతో విధులు నిర్వహించాల్సి ఉంటుంది. తాజాగా శాసనసభ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లాస్థాయి అధికారులు వారి పైఅధికారులు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించే పనిలో నిమగ్నమై ఉన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా స్థాయి ఎన్నికల అధికారి (కలెక్టర్) నుంచి బూత్ లెవెల్ అధికారి (బీఎల్వో) వరకు వివిధ స్థాయిలోని ఎన్నికల అధికారుల గురించి...

జిల్లా ఎన్నికల అధికారి

జిల్లా ఎన్నికల అధికారిగా కలెక్టర్ బాధ్యతలు నిర్వర్తిస్తారు. మిగతా ఎన్నికల నిర్వహణ అధికారులు వీరి ఆధ్వర్యంలో సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుంది. కిందిస్థాయి అధికారులకు విధులు కేటాయిస్తూ నిరంతరం సమీక్షలు జరుపుతారు. అధికారులు అందరికీ దిశా నిర్దేశం చేస్తారు. జిల్లాస్థాయిలో కావాల్సిన శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి వాటిని పర్యవేక్షిస్తారు. ఓటరు జాబితా రూపకల్పన మొదలు ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడి పూర్తయ్యే వరకు జిల్లా ఎన్నికల అధికారిదే పూర్తి బాధ్యత.

రిటర్నింగ్ అధికారి

రిటర్నింగ్ అధికారులుగా నియోజకవర్గానికి ఒకరు ఉంటారు. వీరిని ఆయా నియోజకవర్గానికి సంబంధించిన శాసనసభ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల కమిషన్ నియమిస్తుంది. తమ పరిధిలోని ఎన్నికల ప్రక్రియను వీరు పర్యవేక్షిస్తారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, తిరస్కరణ, అభ్యర్థుల తుది జాబితా ప్రకటన, పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది నియామకం, శిక్షణ, ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడి, వసతుల కల్పన, తదితర అంశాలు వీరి పరిధిలో ఉంటాయి.

సెక్టోరియల్ అధికారి

ఎన్నికల ప్రక్రియ సజావుగా జరగడానికి సెక్టోరియల్ అధికారులు కీలక పాత్ర పోషిస్తారు. ముఖ్యంగా పోలింగ్ బూత్‌ల పర్యవేక్షణ బాధ్యతలు వీరు చూస్తారు. ఒక్కొక్కరి పరిధిలో దాదాపు 6 నుంచి 9 పోలింగ్ కేంద్రాలు ఉంటాయి. వాటిలో ర్యాంపుల ఏర్పాటు, తాగునీటి వసతి, ఫర్నీచర్, విద్యుత్, లైట్లు, ఫ్యాన్లు, వంటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహణ జరిగేలా చూస్తారు. తమ పరిధిలో జరిగే అంశాలకు వీరే బాధ్యత వహిస్తారు.

ప్రిసైడింగ్ అధికారి

ప్రతీ పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారి ఉంటారు. ఆ పోలింగ్ కేంద్రం పరిధిలో జరిగే అన్నింటికీ వీరిదే సంపూర్ణ బాధ్యత. ఓటింగ్‌కు అవసరమైన ఈవీఎంలు, వీవీప్యాట్లు, ఇతర సామగ్రి తీసుకొస్తారు. పోలింగ్ అనంతరం ఎన్నికల సామగ్రిని తిరిగి నియోజకవర్గస్థాయి స్ట్రాంగ్ రూమ్‌కు చేరుస్తారు. వీరికి సహాయకంగా అదనపు ప్రొసీడింగ్ అధికారి ఉంటారు. పోలింగ్ కేంద్రాల్లో జరిగే కార్యకలాపాలన్నీ వీరి పర్యవేక్షణలోనే ఉంటాయి. ఎన్నికల సంఘం రూపొందించిన నియమావళికి అనుగుణంగా వీరు పనిచేస్తారు. వీరితోపాటు మరో ఇద్దరు పోలింగ్ అధికారులు పనిచేస్తారు. పోలింగ్ బూత్‌లలోని ఈవీఎంల పనితీరు, ఇతర కార్యకలాపాలకు వీరిదే బాధ్యత.

ఓటు నమోదు అధికారులు

బూత్ స్థాయి అధికారులు అందించిన సమాచారంతో ఓటరు జాబితాను తయారు చేయడం వీరి ప్రధాన బాధ్యత. కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారు, జాబితాలో పేర్లు సరిచేసుకునేవారు ఈ అధికారిని సంప్రదించాల్సి ఉంటుంది. తుది ఓటరు జాబితా రూపకల్పనలో వీరిదే ప్రధాన పాత్ర.

బూత్ లెవెల్ అధికారులు

ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో గ్రామస్థాయిలో పనిచేసే వారే బూత్ లెవెల్ అధికారులు(బీఎల్వోలు). గ్రామంలో 18 సంవత్సరాలు నిండిన యువత, ఓటు హక్కుకు అర్హులైన వారిని ఓటు నమోదు చేసుకునేలా వీరు అవగాహన కల్పిస్తారు. కావాల్సిన దరఖాస్తులు వీరి వద్ద ఉంటాయి. పూర్తి చేసిన దరఖాస్తులను స్వీకరించి నమోదు చేసిన అనంతరం తుది జాబితా ప్రదర్శన, పోలింగ్ కేంద్రాల మార్పునకు సంబంధించి పై అధికారులకు సహకరించడం వీరి ప్రధాన బాధ్యత.

ఎడమచేతి చూపుడు వేలిపై సిరా

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికల్లో అక్రమాలను నిరోధించేందుకు, దొంగ ఓట్ల నమోదును నివారించేందుకు ఎన్నికల సంఘం సిరాను వినియోగిస్తుంది. పోలింగ్ బూత్‌లో ఓటర్ల ఎడమచేతి చూపుడు వేలిపై సిరా రాస్తారు. చర్మంపై పూసిన ఈ సిరాను త్వరగా తొలగించడం సాధ్యపడదు. వేలిపై పూసిన సిరా కాంతి పడిన 15 నుంచి 30 సెకన్లలో పొడి బారుతుంది. కొంతకాలం వరకు వేలికి సిరా ఉంటుంది. ఎన్నికలకు వినియోగించే సిరా 10 శాతం, 14 నుంచి 18 శాతం సిల్వర్ నైట్రేట్ ద్రావణం మిలితమై ఉంటుంది. సిరాలోని సిల్వర్ నైట్రేటీతో సూర్య రశ్మి తగలగానే చర్మంపై స్పష్టమైన గుర్తు ఏర్పడుతుంది. కర్ణాటక ప్రభుత్వ రంగంలోని మైసూర్ పెయింట్స్ అండ్ వార్నిష్, హైదరాబాద్‌లోని ఓ ప్రయోగశాలలో ఈ సిరాను తయారు చేస్తున్నారు. భారత ఎన్నికల సంఘం వద్ద ఈ సిరా ఉత్పత్తికి 1962లోనే ఆయా సంస్థలు హక్కులు పొందాయి. 1976 నుంచి మరో 28 దేశాలకు ఈ సంస్థ సిరాను సరఫరా చేస్తోంది. ఒకరు ఓటు వేశాకా మళ్లీ పోలింగ్ బూత్‌కు వచ్చే పరిస్థితి ఉండదు. ఒకవేళ ఓటు వేయడానికి వచ్చినా అక్కడి సిబ్బంది వారి వేలిని చూసి గుర్తు పట్టేస్తారు.

అనుమానాస్పదంగా యువకుడు మృతి



నితిన్ మృతదేహం

తానూరు(ముధోల్): అనుమానాస్పదంగా యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బామ్నితండాకు చెందిన రాథోడ్ నితిన్ (24) బుధవారం రాత్రి కల్లు సేవించేందుకు బామ్ని గ్రామానికి వెళ్లి వస్తుండగా మూత్రవిసర్జనకు వెళ్లి రోడ్డుపక్కన పడిపోయాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భైంసా ఆస్పత్రికి తరలించడంతో పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కల్తీ కల్లు తాగి పడిపోయాడా? ఎవరైనా హత్య చేశారా? అని అనుమానం ఉందని మృతుని సోదరుడు సునీల్ ఫిర్యాదు మేరకు గురువారం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

స్వగ్రామం చేరిన మృతదేహం

దిలావర్‌పూర్: ఇటీవల ఓమన్ దేశంలో గుండెపోటుతో మృతి చెందిన వ్యక్తి మృతదేహం గురువారం స్వగ్రామం చేరుకుంది. మండల కేంద్రానికి చెందిన జుంబెర చిన్న ముత్యం (51) కొన్నేళ్ల క్రితం ఉపాధికోసం ఓమన్‌దేశానికి వెళ్లాడు. అక్కడే పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పది రోజుల క్రితం గుండెపోటు రావడంతో అక్కడే మృతి చెందాడు. మృతదేహం స్వగ్రామం చేరుకుంది. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

కారు.. ప్రచార జోరు



బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తును ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో మంత్రి ఐకేరెడ్డి అంబాసిడర్ కారుకు పూర్తిగా గులాబీరంగు వేయించాడు. దానిపై సీఎం కేసీఆర్, మంత్రి చిత్రపటాలను గీయించాడు. కారుకు గులాబీరంగు విద్యుత్ సిరీస్ పెట్టడంతో జిల్లా కేంద్రంలోని రోడ్లపై చక్కర్లు కొడుతూ అందరినీ ఆకట్టుకుంటోంది.
- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

ఎన్నికల ప్రచారంలో బడీడు పిల్లలు





జిల్లాలో ఎన్నికల ప్రచారం జోరందుకుంది. వివిధ పార్టీల నాయకులతో పాటు బడీడు పిల్లలు కూడా పార్టీ జెండాలు మోస్తూ కండువాలు మెడలో వేసుకుని ప్రచారంలో పాల్గొంటున్నారు. ఆ దృశ్యాలను 'సాక్షి' కెమెరాలో క్లిక్ మనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

రూ.4.39 లక్షల నగదు పట్టివేత

జైనథ్: మండలంలోని పిప్పర్‌వాడ చెక్‌పోస్ట్ వద్ద గురువారం కారులో తరలిస్తున్న రూ.4 లక్షల 39 వేల 500ల నగదును సీజ్ చేశారు. మహారాష్ట్ర నుంచి ఆదిలాబాద్ వైపు వస్తున్న కారును తనిఖీ చేయగా ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న నగదు లభించడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. నగదును సీజ్ చేసి, కారు డ్రైవర్ కారేకర్ దిలీప్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సీజ్ చేసిన నగదును ఆదిలాబాద్ డీటీవో కార్యాలయానికి అప్పగించినట్లు వారు పేర్కొన్నారు.



సీజ్ చేసిన నగదుతో అధికారులు

క్షణికావేశంలో వ్యక్తి ఆత్మహత్య



విజయ్ (ఫైల్)

నేరడిగొండ(బోథ్): క్షణికావేశంలో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం బుట్టపూర్ గ్రామానికి చెందిన గడ్డ విజయ్ కుమార్ (28) బుధవారం తర్నం(కె) గ్రామంలోని అత్తగారింటికి వచ్చాడు. ఇంటికి వెళ్దామని భార్యతో చెప్పడంతో ప్రసవం తర్వాత వస్తానంది. దీంతో నీవు నాతో రాకపోతే ఇక్కడే చనిపోతానని చెప్పి క్షణికావేశంలో వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు అంబులెన్స్ ద్వారా చికిత్స నిమిత్తం ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య..

భైంసారూరల్(ముధోల్): ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చింతల్‌బోరి గ్రామానికి చెందిన ఎల్కొల్వార్ సాయినాథ్ (27) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో తాగిన మైకంలో బుధవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్యతో పాటు కుమారుడు ఉన్నారు. మృతుని భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సిరికొండ: మండల కేంద్రంలో గురువారం సాయంత్రం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. మండలంలోని జాకీర్‌గూడ గ్రామానికి చెందిన జాదవ్ నందకిశోర్ సిరికొండ నుంచి జాకీర్‌గూడకు బైక్‌పై బయలుదేరాడు. గుడిహత్నూర్ మండలంలోని తేజపూర్ గ్రామానికి చెందిన కొర్రి రమేశ్ బైక్‌పై తేజాపూర్ నుంచి సిరికొండకు వస్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నారు. స్థానికుల సమాచారంతో క్షతగాత్రులను 108లో ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థిని మృతి

ఆదిలాబాద్‌రూరల్: గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఓ విద్యార్థిని మృతి చెందిన సంఘటన ఆదిలాబాద్ రూరల్ మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని వాన్‌వాట్ గ్రామానికి చెందిన మడావి రాంసాయి-దేవుబాయి దంపతుల కూతురు శివాత్మిక (14) ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. కొన్ని రోజులుగా బాలిక గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. తల్లిదండ్రులు చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. విద్యార్థి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

గుడుంబా స్వాధీనం

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని నార్లపూర్‌లో గంపాల పోచమ్మ అనే మహిళ ఇంట్లో గురువారం ఐదు లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేయగా ఐదు లీటర్ల గుడుంబా లభ్యంకావడంతో స్వాధీనం చేసుకుని పోచమ్మపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరి మృతికి కారణమైన వ్యక్తి అరెస్ట్

జన్నారం(ఖానాపూర్): అతివేగంగా, అజాగ్రత్తగా కారు నడిపి ఇద్దరి మృతికి కారణమైన డ్రైవర్‌ను గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా హైదరాబాద్‌లో కారును గుర్తించిన పోలీసులు సీజ్‌చేసి స్టేషన్‌కు తరలించారు. ఎస్సై సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 23 న జన్నారం మండలం పొనకల్‌కు చెందిన పిప్పెర్ల రాహిత్య, తరాల్ల సాత్విక, పిప్పెర్ల గంగన్న బైక్‌పై వస్తుండగా చెక్కపెల్లి కుంట వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. రాహిత్య, సాత్విక మృతి చెందగా గంగన్నకు తీవ్రగాయాలయ్యాయి.

ప్రమాదం జరిగింది ఇలా..

మంచిర్యాల జిల్లా సీసీ నస్పూర్‌కు చెందిన బుద్దె మల్లేశ్, అతని కుమారుడు బుద్దె దిలీప్ ఈ నెల 23న తన అత్తగారి ఊరైన దేవునిగూడకు వచ్చాడు. దిలీప్ మధ్యాహ్నం నస్పూర్ వెళ్లి సాయంత్రం దేవునిగూడకు వచ్చేక్రమంలో బైక్‌ను ఢీకొట్టాడు. గుట్టుచప్పుడు కాకుండా హైదరాబాద్‌కు పరారయ్యాడు.

ఇరువురిపై కేసు నమోదు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన ఇరువురు సోదరులపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నర్సింగాపూర్‌లో నివాసం ఉంటున్న నస్పూరి బాపు, రాపల్లిలో నివాసం ఉంటున్న అతని సోదరుడు సతీశ్ ఓ భూమికి సంబంధించి వాగ్వాదానికి దిగడంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. పరస్పరం జరుపుకున్న దాడిలో ఇరువురు సోదరులు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేయగా కేసులు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామానికి చెందిన ఇరువు రు సోదరులపై గురువారం పోలీస్ స్టేషన్‌లో కే సు నమోదైంది. ముల్కల్లకు చెందిన సామంతు ల శ్రీను, భూమయ్య భూమికి సంబంధించి గొ డవ పడి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ మేరకు ఇరువురు సోదరులు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.